క్లుప్తంగా

అంగన్‌వాడీ కార్యకర్తకు సత్కారం

కపిలేశ్వరపురం: కేదారిలంక ఓసీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో దీర్ఘకాలంపాటు కార్యకర్తగా విశేష సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేసిన నామాడి దమయంతిని గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సత్కరించారు. నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు దమయంతి సేవలు ప్రశంసించారు. పీఏసీఎస్ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన



రాజమ్మకాలనీ వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: రక్తహీనతను అవగాహనతో అధిగమించాలని మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో వైద్యులు అన్నారు. రక్తహీనతపై ప్రజల్లో అవగాహన కలిగించాలన్న లక్ష్యంతో శుక్రవారం ఆయా పీహెచ్‌సీల పరిధిలో ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. అంగర రాజేశ్వరి ఆలయం సమీపంలో నిర్వహించిన సదస్సులో వైద్యాధికారి పి.రత్నకుమారి మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, ఎస్.నూకరాజు, హెచ్‌వీ టి.మేరీమణి, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం

మండపేట: పట్టణంలోని రథం గుడిలో వేంచేసియున్న శ్రీకైలాసేశ్వర, అగస్తేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం అన్నాభిషేకం ఘనంగా జరిగింది. ధనుర్మాసం, స్వామి జన్మ నక్షత్రం ఆరుద్ర పురస్కరించుకుని ఆలయ అర్చకులు అయినవిల్లి వరహాలు, ఆనంద్, రాళ్లపల్లి సుబ్రహ్మణ్య అవధాని తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పింఛన్లు, ఓటీఎస్ పట్టాల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో నూతన పింఛన్లు, వన్ టైమ్ సెటిల్‌మెంట్ పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, గ్రామ సర్పంచ్ టేకుమూడి సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి చేతుల మీదుగా కొత్తగా మంజూరు అయిన 17 పింఛన్లు, 31 ఓటీఎస్ పట్టాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, వెలంపాలెం సొసైటీ చైర్మన్ పలివెల నాగరాజు, సచివాలయ కన్వీనర్లు చల్లా శ్రీనివాసు, పువ్వల నాగభూషణం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వసతులకు చర్యలు తీసుకోవాలి

మండపేట: టిడ్కో ఫ్లాట్లలో కనీస వసతులు కల్పించకపోవడంతో అందులో నివసిస్తున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన ఫ్లాట్లను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాగునీరు తదితర వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీఠంలో పౌర్ణమి పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో పుష్య పౌర్ణమి పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా విజయదుర్గా అమ్మవారిని వివిధ సుగంధభరిత పూల మాలలు, ఆభరణాలతో అలంకరించారు. వేద పండితులు చీమలకొండ వీరావధాని, కోట లక్ష్మీనారాయణ అమ్మవారికి లలితా అష్టోత్తర సహస్రనామాలు, దుర్గ, సరస్వతి, లక్ష్మీ అష్టోత్తరాలతో లక్ష కుంకుమ పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) ఆశీస్సులు పొందారు. పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ) ఆధ్వర్యాన అన్న సమారాధన నిర్వహించారు.

దివ్యాంగులకు ధీమా

- అర్హులందరికీ అందించేందుకు కసరత్తు
- ఒక్కో వాహనం విలువ రూ.లక్ష పైమాటే

రాయవరం: పుట్టుకతోనే దివ్యాంగులుగా మారిన వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. కాళ్లు సక్రమంగా పనిచేయని దివ్యాంగులకు స్కూటీ తరహాలో మూడు చక్రాల వాహనాలను అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. నడవలేక.. సైకిల్‌పై వెళ్ల లేక ఇబ్బందులు పడుతున్న వారందరికీ ఇది ప్రయోజనకరం. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో వాహనంపై రూ.లక్షకుపైగా ఖర్చు చేసి ఈ వాహనాలను దివ్యాంగులకు అందించేందుకు అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారులు వీటిని లబ్ధిదారులకు అందించేందుకు సన్నద్ధమవుతున్నారు.



మోటారైజ్డ్ ట్రై సైకిల్

నియోజకవర్గానికి 10 వంతున

ప్రతి నియోజకవర్గంలో అర్హులైన 10 మంది దివ్యాంగులందరికీ మోటారైజ్డ్ ట్రైసైకిల్ వెహికల్‌లను అందించాలని అధికారులు ముందుకు వెళ్తున్నారు. తొలి విడతలో వచ్చిన వాహనాలను లబ్ధిదారులకు అందించిన అనంతరం మిగిలిన వారికి మలి విడతలో అందించనున్నారు. ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు.

క్లస్టర్ పరిధిలో 20 వెహికల్స్ మంజూరు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని దివ్యాంగులకు 20 వెహికల్స్ మంజూరు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి పది వెహికల్స్‌ను మంజూరు చేశారు. మంజూరైన వెహికల్స్‌లో మహిళలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకారం మంజూరు చేస్తారు. జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, పీడీ డీఆర్‌డీఏ, డీడీ సాంఘిక సంక్షేమ శాఖ, పీడీ ఐసీడీఎస్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్, ఆర్థో స్పెషలిస్ట్ వైద్యుడు, డీటీసీలు సభ్యులుగా ఉంటారు. వీరందరూ వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారిని ఎంపిక చేస్తారు.

త్వరలో పంపిణీకి చర్యలు



దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు అందజేయనున్నాం. పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. వారికి వెహికల్స్ పంపిణీ చేసే సమాచారాన్ని తెలియజేస్తాం.

– వాడ్రేవు కామరాజు, ఏడీ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, అమలాపురం

స్క్రీనింగ్ పూర్తి

క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటు, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో సుమారు 80 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను కమిటీ పరిశీలన పూర్తి చేసింది. దరఖాస్తుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న లబ్ధిదారులను గుర్తించారు.

బాల్ బాడ్మింటన్‌లో చెల్లూరు విద్యార్థిని ప్రతిభ



దాసరి మధులత

రాయవరం: మండలంలోని చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని దాసరి మధులత రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఇటీవల కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాల్ బాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన టీమ్‌లో మధులత ఉంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో టీమ్ ప్రథమ స్థానంలో నిలవడానికి మధులత అత్యంత ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల పీడీ ఎస్ఎస్‌పీ ప్రభాకర రెడ్డి తెలిపారు. మధులతను సర్పంచ్ పాలిక రాఘవగోవిందు, పీఎంసీ చైర్మన్ మేకా సత్యనారాయణ అభినందించారు.

వృద్ధుల కళ్లలో ఆనందమే జగన్‌కు దీవెనలు

- మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ
- రామచంద్రపురంలో గడపగడపకూ..



రామచంద్రపురంలో మంత్రి వేణుతో సంతోషాన్ని పంచుకుంటున్న వృద్ధులు

రామచంద్రపురం: రాష్ట్రంలో పెరిగిన పింఛన్‌తో వృద్ధుల కళ్లలో కనిపిస్తున్న ఆనందం చూస్తుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారి చల్లని దీవెనలు చాలనిపిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 10 వ వార్డు సచివాలయం పరిధిలోని 22వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం మంత్రి వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు పింఛన్ పెంచినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రితో తమ సంతోషాన్ని పంచుకున్నారు. మంత్రి వేణు గడప గడపలో ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న సంక్షేమాన్ని వివరిస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రికి మీ ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని వారిని కోరారు. రైతుల కోసం రైతు భరోసా, పేదల వైద్యానికి ఆరోగ్యశ్రీ, నాణ్యమైన చదువుల కోసం నాడు-నేడు, చదువుకునే పిల్లలకు అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, గోరుముద్ద లాంటి పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని మంత్రి వివరించారు. పలువురు మహిళలు డ్రైనేజీలతో ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకుని రాగా డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కేతా శ్రీను, బాసిన నాగమణి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

కాజులూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సంక్రాంతి ఆటల పోటీలను బుధవారం డీఎస్పీ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకే తమ శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఐ ఎం.తులసీరామ్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావు, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాతా నాగబాబు, స్కూల్ హెచ్ఎం వెంకటలక్ష్మి, పీఈటి సునీల్ పాల్గొన్నారు.

నవరత్న పథకాలతో పేదల ప్రగతి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెంటూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

రాయవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల ఆర్థిక ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని వెంటూరు శివారు బుట్టాయిపేట, చొల్లంగిపేటల్లో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో త్రిమూర్తులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు ఏ మేరకు లబ్ధిదారులకు ఆనందాన్నిస్తున్నాయో తెలుసుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతకు ముందుగా రూ.66 లక్షలతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో మనబడి నాడు-నేడు పథకంలో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు ఎమ్మెల్సీ త్రిమూర్తులు భూమిపూజ చేశారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉపసర్పంచ్ నున్న ప్రదీప్‌కృష్ణకుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి రవికుమార్, రాష్ట్ర పోలీసు వేర్‌హౌస్ సభ్యురాలు వాసంశెట్టి అనంతలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, పార్టీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణాపుల్లేష్, ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



వెంటూరులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

క్రీడలు ఐక్యతకు ప్రతీక

కపిలేశ్వరపురం: ఆరోగ్యవంతమైన పోటీతో కొనసాగే క్రీడలు ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని అంగర, పడమర ఖండ్రిక సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పెద్దిరెడ్డి శేషారత్నం, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు, హెచ్ఎం రాజు, పీఎంసీ చైర్మన్ శలా కోటేశ్వరరావు అన్నారు. అంగరలో శుక్రవారం సిద్ధిరెడ్డి నరసబాబు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. సిద్ధిరెడ్డి నరసబాబు ఫ్రెండ్ సర్కిల్ నిర్వహించే ఈ టోర్నమెంట్ 14వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 32 జట్లు పోటీలో తలపడనున్నాయి. విజేత జట్టుకు రూ.25వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంకాబత్తుల స్వామికాపు, వాసంశెట్టి వాసు, వ్యాయామోపాధ్యాయులు ముత్తా సత్యనారాయణ, మేకా సత్యనారాయణ పాల్గొన్నారు.



అంగరలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు

ఆధునిక టెక్నాలజీపై సదస్సు



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ పీడీ బాబూరావు

రామచంద్రపురం రూరల్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో తక్కువ ఖర్చుతో ఇళ్లు నిర్మించుకునేందుకు అనువుగా ఉన్న ఆధునిక టెక్నాలజీపై లబ్ధిదారులకు శుక్రవారం వెలంపాలెం గ్రామ సచివాలయం వద్ద హౌసింగ్ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, గ్రామ సర్పంచ్ టేకుమూడి సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సీహెచ్ బాబూరావు నూతన షియర్ వాల్ టెక్నాలజీలో ఇళ్లు నిర్మించే విధానంపై లబ్ధిదారులకు వివరంగా తెలియజేశారు. ప్రభుత్వం అందించే రూ.1,80,000 కాకుండా లబ్ధిదారులకు మరో రూ.80 వేలు మాత్రమే అదనంగా ఖర్చు అవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, హౌసింగ్ డీఈ మల్లికార్జున, ఏఈ రామకృష్ణ, మండల ప్రత్యేక అధికారి రాజు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు భాగస్వామ్యులు కావాలని ఎంఈఓ ఎ.నాగరాజు సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఎమ్మార్సీలో శుక్రవారం బడ్జెట్ ప్రణాళికపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ నిమిత్తం చేయాల్సిన ఖర్చులు, ఇంకా పాఠశాలలో ఎంత మేరకు అభివృద్ధి పనులు చేయాల్సి ఉంటుందని ఆరా తీశారు. హెచ్ఎంలు వెంటనే ఈ ఏడాదికి గాను బడ్జెట్‌ను పక్కాగా రూపొందించి నివేదిక వెంటనే సమర్పించాలని కోరారు. అనంతరం ఎస్ఆర్‌జీ కేఆర్‌కే ప్రసాద్ బడ్జెట్ ప్రణాళికపై అవగాహన కల్పించారు. సీనియర్ హెచ్ఎంలు పుల్లయ్య, సీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగరాజు

గ్రామాల్లో సెంటినల్ సర్వే



ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో తోటపేట, కన్నడతోట, శభాష్‌పేట, ముస్లిం కాలనీ, మండాలమ్మపేటల్లో శుక్రవారం రాత్రి ఫైలేరియా వ్యాధి తీవ్రత నిర్ధారణ కోసం సెంటినల్ సర్వేను నిర్వహించారు. కాకినాడకు చెందిన ఫైలేరియా పరిశోధన, శిక్షణ కేంద్రానికి చెందిన బృందం రెండు రోజుల పాటు తిరిగి 350 మంది నుంచి రక్త నమూనాలు సేకరించింది. జిల్లాలో ఫైలేరియా వ్యాధి తీవ్రత ఎక్కువగా ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఉన్నట్లు ఫైలేరియా నివారణా అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో రక్త నమూనాలను సేకరించామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్. సుమతీదేవి, ఫైలేరియా యూనిట్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ డి.సామ్యూల్‌రాజు, ఏఎన్ఎంలు నాగవేణి, వి.ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదలకు చేయూత

గొల్లపాలెంలో పండగలా కొత్త పింఛన్ల పంపిణీ

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని పేదలకు చేయూత లభిస్తోందని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం గొల్లపాలెం పాపాయమ్మపేటలో గల పాత రైస్‌మిల్లు గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి వేణు మండలంలో కొత్తగా మంజూరైన 324 వికలాంగ, వితంతు, వృద్ధాప్య పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకూ లబ్ధిదారులకు ఏటా పింఛన్ మొత్తాన్ని పెంచుతున్నారన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ రూ.2,500 ఉన్న పింఛన్ ఈ ఏడాది రూ.2,750కి పెరిగిందన్నారు. కాజులూరు మండలంలో 10,199 మందికి ప్రతి నెలా లబ్ధిదారులకు పంపిణీ జరుగుతోందన్నారు. ఇంతపెద్ద మొత్తంలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. ఒక పక్క పబ్లిసిటీ పిచ్చితో జనాలను చంపుతున్న చంద్రబాబునాయుడు జగనన్న పథకాల ద్వారా పేదలకు మేలు జరిగి వారు తమ ప్రభుత్వానికి మరింత చేరువవుతారనే భయంతో అబద్ధపు ప్రచారాలతో బురదచల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎంపీపీ మాత భారతీ, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి వేణు

ఆర్‌బీకే సేవలు వినియోగించుకోవాలి



వెల్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని వెల్ల రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఏఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకుని ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న ఎరువుల గురించి రైతులకు వివరించారు. పీఎం కిసాన్ ఈ-కేవైసీ ఇంకా పూర్తి చేసుకోని వారు జనవరి 15 లోపుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం పంట పొలానికి వెళ్లి రైతులకు కలుపు నివారణ యాజమాన్యంపై అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

కె.గంగవరం: మండల పరిధిలోని అముజూరు, పామర్రు, పాణింగపల్లి తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, డ్వాక్రా వీఏఓ సంయుక్తంగా పోషక ఆహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాణింగపల్లిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మల్లికార్జునుడు మాట్లాడుతూ యుక్త వయస్సులో బాలబాలికలకు రక్తహీనత రాకుండా తీసుకోవల్సిన చర్యలను వివరించారు. గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టిక ఆహారం తీసుకుని ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీల ద్వారా మంచి పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్న ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ చీకట్ల సునీత, పీహెచ్‌సీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



రాయవరంలో నూతనంగా మంజూరైన పెన్షన్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిరంతరాయంగా అందజేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. రాయవరం వెలమ కల్యాణ మంటపంలో శుక్రవారం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమంలో త్రిమూర్తులు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తమకు పథకం అందలేదని అర్హత ఉన్న ఏ ఒక్కరూ అనకూడదని ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఈ నెల నుంచి రూ.2,750 పెన్షన్‌ను లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, మెరుగైన జీవనం సాగించాలని త్రిమూర్తులు సూచించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, మండల కన్వీనర్ చిన్నం అపర్ణా పుల్లేష్ మాట్లాడారు. అనంతరం నూతనంగా మంజూరైన పెన్షన్లు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు త్రిమూర్తులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పింఛను పెంపుతో ఆనందం రెట్టింపు



పింఛనుదారులకు సొమ్ములు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాంబాబు తదితరులు

కె.గంగవరం: పింఛను సొమ్ము పెంపుతో పింఛనుదారుల్లో ఆనందం రెట్టింపు అయిందని సర్పంచ్ పిల్లి రాంబాబు అన్నారు. మండల పరిధిలోని యర్రపోతవరం గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం పెంచిన పింఛను సొమ్మును గ్రామ పార్టీ కన్వీనర్లతో కలసి ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇచ్చిన మాట ప్రకారం పింఛను సొమ్ములను పెంచిందన్నారు. మాజీ ఉప సర్పంచ్ మేడిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో నూతనంగా మంజూరు అయిన పింఛన్లను లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు బల్ల సుధాకర్, గ్రామ సచివాలయ కన్వీనర్ సాదే రాజేశ్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు.పంచాయతీ కార్యదర్శి ప్రసాదరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.